క్లుప్తంగా

నేడు మంత్రి రాజా పర్యటన

కోటనందూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించే 'వై ఏపీ నీడ్ జగన్' కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పాల్గొంటారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కంచె తొలగించాలని వినతి



ఎమ్మెల్యే పర్వతకు వినతి పత్రం సమర్పిస్తున్న వ్యాపారులు

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానం టోల్‌గేట్ ఎదురుగా మెయిన్ రోడ్‌పై దేవస్థానం అధికారులు వేసిన కంచె తొలగించాలని స్థానిక ప్రజలు, వ్యాపారులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు క్రాస్ చేసేందుకు వీలుగా టోల్‌గేట్‌కు ఎదురుగా ఖాళీ ఉంచారని, ఇప్పుడు ఆ ఖాళీ స్థలంలో కంచె వేశారని తెలిపారు. దీంతో టోల్ గేట్ వద్దకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందన్నారు. దీనిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని దేవస్థానం, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ, పోలీస్ శాఖ అధికారులను ఎమ్మెల్యే పర్వత ఆదేశించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల చెంతకే వైద్యం



అచ్చంపేటలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సౌమ్యశ్రీ

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ అన్నారు. మండలంలోని అచ్చంపేటలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. కౌమార దశలో ఉన్న యువతుల్లో రక్తహీనత ఉంటే ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు వెళ్లి చిన్నారులను పరీక్షించారు. ప్రస్తుత సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 60 మంది సాధారణ రోగులు,10 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 50 మంది మధుమేహ బాధితులు, 60 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించినట్టు వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు.

ఖరీఫ్‌లో ధాన్యం సేకరణపై శిక్షణ



ధాన్యం సేకరణపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఎంఎస్ఓ కిరణ్ కుమార్

తుని రూరల్: ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ, నాణ్యతా ప్రమాణాల్లో నిబంధనలు పాటించాలని మండల పౌరసరఫరాలశాఖ అధికారి కిరణ్ కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం తుని, తొండంగి, కోటనందూరు మండలాలకు చెందిన వీఆర్వోలు, వీఏఏలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి ధాన్యం సేకరణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతుల నుంచి ఏవిధంగా ధాన్యం సేకరించాలి, నాణ్యత ప్రమాణాలు గుర్తింపు తదితర అంశాలను ఎంఎస్ఓ సమగ్రంగా వివరించారు. సిబ్బంది ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలని సూచించారు. తుని, కోటనందూరు, తొండంగి మండలాల వ్యవసాయ అధికారులు బి.అశోక్ కుమార్, చంద్రశేఖర్, నరసింహ, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

తుని: స్థానిక డేటా ప్రో కార్యాలయంలో రోటరీ క్లబ్ తుని శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణను క్లబ్ అధ్యక్షుడు కేఎస్ఎల్ఎస్ వర్మ శుక్రవారం ప్రారంభించారు. ఎకనమిక్ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా డేటా ప్రో కంప్యూటర్స్ వారి ఆర్థిక సహాయంతో యువతకు శిక్షణ ఇస్తున్నట్టు వర్మ తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న యువతీ, యువకులకు ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, టాలీ కోర్సుల్లో వారికి నచ్చిన కోర్సులో శిక్షణ ఇస్తామన్నారు. సమాజ అభివృద్ధికి రోటరీ క్లబ్ తుని శాఖ ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కె.కిషోర్‌రెడ్డి, ప్రతినిధులు వివేక్, డీవీ రాజు, డి.నాగేశ్వరరావు, సీహెచ్ మంగరాజు, ఎస్.వీర్రాజు, పి.ప్రసాద్, డేటా ప్రో నిర్వాహకుడు వై.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సిరిపురంలో సురక్ష కిట్లు పంపిణీ చేసిన నాయకులు



కొత్త సూరవరంలో రోగులకు సురక్ష కిట్లు అందజేస్తున్న నాయకులు



పెదశంకర్లపూడిలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



తిరుమలాయపాలెంలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

పేదలకు వరం ఆరోగ్య సురక్ష

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



పాలెంలో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఓ వరమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని పాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ తోట రవితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందుతున్నాయన్నారు. గతంలో అనారోగ్యం వస్తే పట్టణాలకు ప్రజలు పరుగులు తీసేవారని, ప్రస్తుతం గ్రామాల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు రవికుమార్, జ్యోతి, వెంకట్, జ్యోతిర్మయి, కళాసాగర్ 414 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మరో 10 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రాలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో అడబాల కొండబాబు, అడబాల సుబ్బారాయుడు, ఆదారి వీరబాబు, కరణం కోటేశ్వరరావు, తహసీల్దార్ కేవీ మాధవరావు, ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ, వైద్య సిబ్బంది గంగాధర్, జేమ్స్, తాతారావు, సూర్యప్రకాశ్, రాజా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

తుని రూరల్: ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. మండలంలోని ఎస్.అన్నవరం శివారు కొత్త సూరవరంలో వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణితో కలసి ఎంపీపీ ప్రారంభించారు. ఎస్.సూరవరం పీహెచ్‌సీ వైద్యాధికారి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిపుణులైన వైద్యులు రోగులకు సేవలు అందించారు. అనంతరం రోగులకు ప్రజాప్రతినిధులు మందుల కిట్లు పంపిణీ చేశారు. జేసీఎస్ ఇన్‌చార్జి సకురు నాగేంద్ర నెహ్రూ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, నాయకులు గారా శ్రీనివాసరావు, ఎంపీడీఓ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ఏలేశ్వరం: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి అన్నారు. మండలంలోని సిరిపురంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకుమారి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి ఒక్క రూపాయి భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, సర్పంచ్ పీతల నూకరాజు, అల్లం ఆదినారాయణ, నీరుకొండ సత్యనారాయణ, అలమండ చలమయ్య, అడపా పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

ప్రత్తిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని అన్నవరం ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్ దోశ చిట్టిబాబు అన్నారు. మండలంలోని పెదశంకర్లపూడిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. శిబిరంలో డాక్టర్లు సుమారు 450 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోట పద్దరాజు, పంచాయతీ సభ్యులు గోకాడ చిన్నయ్య, దిమ్మల రాజు, యోలాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు సురక్ష దోహదం

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి గ్రామస్తులు విశేష సంఖ్యలో హాజరై వైద్యసేవలు పొందారు. వీరికి మెడికల్ కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులు, జేసీఎస్ జిల్లా కన్వీనర్లకు సత్కారం



తొండంగిలో జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఒమ్మి రఘురాంను సత్కరిస్తున్న మంత్రి రాజా

తొండంగి: వైఎస్సార్ సీపీ గృహసారథులు, జేసీఎస్ జిల్లా కన్వీనర్లను రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా శుక్రవారం సన్మానించారు. తొండంగిలో జరిగిన ఏపీకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా జేసీఎస్ జిల్లా కన్వీనర్లు ఒమ్మి రఘురాం, బత్తుల సాయిరామ్‌లను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, జేసీసీ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, మండల కన్వీనర్ బద్ది నూకరాజు, యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబా చౌదరి, పార్టీ నాయకులు దడాల విజయ్, అంగుళూరి సుశీల, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళ్లిపూడి అంజనేయులు, ఏలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు డైరెక్టర్ తోలాడ శైలాపార్వతి తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఆయుష్మాన్ భవ వైద్య సేవలు



కొత్తసూరంలో మాట్లాడుతున్న ఆయుష్మాన్ భవ కేంద్ర బృందం సభ్యుడు డాక్టర్ వీర్‌భారతీ

తుని రూరల్: పేదలందరికీ ఆయుష్మాన్ భవ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆయుష్మాన్ భవ కేంద్ర బృందం సభ్యుడు డాక్టర్ వీర్‌భారతీ అన్నారు. తుని మండలం కొత్త సూరవరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షల వరకూ ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. ఈ సేవలను దేశంలో ఎక్కడైన సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఇందుకు ఆయుష్మాన్ భవ కార్డులను జారీ చేస్తున్నట్టు తెలిపారు. కాకినాడ జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రమేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాల పంపిణీ చేశారు. వేద పండితులు యనమంద్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, ప్రయాగ రాంబాబు, కోట వంశీ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి కంచిభట్ల సాయిరామ్, యడవిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలేశ్వరం: ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట ఈఈ కె.రత్నాలరావు శుక్రవారం తెలిపారు. స్థానిక జగనన్న కాలనీలో విద్యుత్ సబ్ స్టేషన్‌కు నూతనంగా 33 కేవీ లైన్ ఏర్పాటు చేస్తున్న కారణంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం, శ్రీవిద్య స్కూల్, పెద్దవీధి, నంది వీధి, లచ్చారావు కాలనీ, మందుల కాలనీ, వెంగళరావు కాలనీ, నైయలపేట, వైఎస్సార్ నగర్, తోటవీధి, సామంతులవారి వీధి, వెటర్నరీ హాస్పిటల్, పల్లపు వీధి, అప్పన్నపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

జగ్గంపేట: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని ఎంఈఓ ఆర్.స్వామి కోరారు. జగ్గంపేటలో శుక్రవారం చెకుముకి సైన్స్ సంబరాల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. యూటీఎఫ్ నాయకులు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

మహిళపై దాడి

రౌతులపూడి: మండలంలోని రాజవరంలో శుక్రవారం మహిళపై దాడి జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నాతవరం మండలం రొంగలి కొత్తూరు గ్రామానికి చెందిన గొంప శ్రీను అనే వ్యక్తి తనపై దాడికి పాల్పడ్డాడని ఓ మహిళ రౌతులపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అబ్దుల్‌నబీ తెలిపారు.

18న మాదిగల విశ్వరూప మహాసభ

జగ్గంపేట: హైదరాబాద్‌లో వచ్చే నెల 18న జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఉత్తర కోస్తాంధ్ర, సీమాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు పిలుపునిచ్చారు. జగ్గంపేట ఆశీర్వాద్ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు.

ఆర్‌బీకేల్లో ఈ– పంట నమోదు వివరాలు



జగపతినగరం ఆర్బీకేలో ఈ-పంట నమోదు వివరాలను ప్రదర్శిస్తున్న ఏఓ జోకా అమృత

కిర్లంపూడి: ఖరీఫ్‌లో ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు, పంటల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించినట్టు మండల ఏఓ జోకా అమృత తెలిపారు. జగపతినగరం ఆర్బీకేలో రైతులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో ఈ–పంట నమోదుకు సంబంధించి సోషల్ ఆడిట్ పూర్తి చేశామన్నారు. పంట నమోదు చేయించుకున్న రైతుల పేర్లు, పంట వివరాలతో కూడిన లిస్టులు ఈ నెల 29 వరకూ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. రైతుల పేర్లు, పంట వివరాల్లో మార్పులు ఉంటే గ్రీవెన్స్ ద్వారా సరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ రామకృష్ణ, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు జాబితా

ఏలేశ్వరం: రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ పంటల నమోదు జాబితాలను ప్రదర్శించినట్టు మండల ఏఓ బి.జ్యోతి తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో పంట నమోదు జాబితాను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పంట నమోదు జాబితాలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 30లోగా తెలియజేయాలన్నారు. మండల పరిధిలోని 16 రైతు భరోసా కేంద్రాల్లోనూ పంట నమోదు జాబితాలను ప్రదర్శించినట్టు తెలిపారు. రైతులు జాబితాను పరిశీలించి అభ్యంతరాలు తమ సిబ్బందికి తెలపాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేం



తునిలో పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ గీతారామకృష్ణ



ఏలేశ్వరంలో విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీష్ కుమార్

తుని: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని పట్టణ సీఐ ఎం.గీతారామకృష్ణ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ పోలీసుస్టేషన్లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ ప్రోగాం నిర్వహించారు. పోలీసుస్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ, కమ్యూనికేషన్ సెట్, రిసెప్షన్, ఆయుధాలు, జైలుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్టేషన్‌కు ఏదైనా ఫిర్యాదు వస్తే ఎలా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు, విచారణ తదితర అంశాలను వివరించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సై, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల విధులపై అవగాహన

రౌతులపూడి: స్థానిక శ్రీహర్ష విద్యానికేతన్ విద్యార్థులకు పోలీసుల విధులుపై శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివిధ విభాగాలు, ర్యాంకుల వారీగా సిబ్బంది విధులు, సేవలను ఎస్సై అబ్దుల్ నబి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్‌పై విద్యార్థులకు అవగాహన

ఏలేశ్వరం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఓపెన్ హౌస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సతీష్ కుమార్ ఆయుధాలు పనిచేసే విధానం, రిసెప్షన్ కౌంటర్, రికార్డ్ రూమ్, పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే కౌనెలింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

3న కార్తిక మాస ఏర్పాట్లపై సమావేశం

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నవంబర్ 12 నుంచి కార్తిక మాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. కార్తిక మాసంలో దేవస్థానానానికి వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించేందుకు వచ్చే నెల 3న దేవస్థానం, ప్రభుత్వశాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసినట్టు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ప్రెస్‌నోట్ విడుదల చేశారు. రత్నగిరి రామాలయం వద్ద గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సమావేశంలో పాల్గొని తగు సూచనలు, సలహాలు ఇస్తారని చెప్పారు.

మహిళ అదృశ్యం

రౌతులపూడి: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ శుక్రవారం తెలిపారు. మండలంలోని ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన నంబారు శ్రీదేవి అనే మహిళ తన భర్తపై అలిగి గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త నంబారు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసినవారు 94407 96552, 70755 71014 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

ప్రత్తిపాడు: ఎలక్షన్ కమిషన్ ఓటు నమోదుకు మరో అవకాశం కల్పించిందని నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఓటరు జాబితా డ్రాఫ్ట్ ప్రచురణపై నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ నవంబర్ 4, 5, డిసెంబర్ 2, 3 తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో 71 మంది సైనిక ఓటర్లు ఉన్నారన్నారు. ఇంతవరకు ఓటరుగా నమోదు కాని వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో సీనియర్ బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నా మట్టి-నా దేశంపై అవగాహన ర్యాలీ

తుని రూరల్: ఏ దేశానికైనా సంస్కృతీ సాంప్రదాయాలే గుర్తింపును ఇస్తాయని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నా మట్టి–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. మన మట్టిని, మన దేశాన్ని కాపాడుతామంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ డాక్టర్ రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, జెడ్పీటీసీ పోతల సూర్యమణి, ఎంపీడీఓ పి.రవికుమార్, చిటికెల వరహాలబాబును క్లస్టర్ వలంటీర్లు ఘనంగా సత్కరించారు. అనంతరం నా మట్టి–నాదేశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో వైద్య ఆరోగ్య సిబ్బంది దోమల నివారణ కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం గ్రామంలోని సచివాలయం–3 పరిధిలో ఫీవర్ సర్వే నిర్వహించి, దోమల నివారణ మందు పిచికారీ చేశారు. దోమల లార్వా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సీహెచ్ ఆనంద్, ఎ.వీరన్న, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

గోకవరం: దేవీ శరన్నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని వీరభద్రునిగడ్డలో శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో అన్నదానం చేశారు. ఈ అన్నదానానికి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రూ.1.10 లక్షల విరాళం అందించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు ఐదు వేల మంది పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రతి నెలా 1న పెన్షన్ చెల్లించాలి

ప్రత్తిపాడు: విశ్రాంత ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ చెల్లించాలని మండల పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు, విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం కోరారు. ప్రత్తిపాడు సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మండల పెన్షనర్ల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఫ్యామిలీ పెన్షనర్లకు పెన్షన్ 50 శాతం పెంపుదల చేయాలని, పీఆర్‌సీ ఎరియర్స్ తక్షణమే చెల్లించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు యలమంచలి రామం, ఎ.శేషగిరిరావు, బి.కోటేశ్వరరావు, ఎం. సుబ్రహ్మణ్యం, బొడ్డేటి ఆదిరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకుంటే జరిమానా

కిర్లంపూడి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే కఠిన చర్యలతో పాటు జరిమానా తప్పదని జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జగపతినగరం ప్రధాన రహదారిపై శుక్రవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ప్రత్తిపాడు నుంచి కిర్లంపూడి వైపు వేగంగా వెళుతున్న పలు వాహనాలను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వాహనాలదారుల వద్ద లైసెన్సులు, రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక ఎస్సై పి.ఉమామహేశ్వరరావు ఉన్నారు.

ఏటీఎం ప్రారంభం

రౌతులపూడి: ప్రజలు సెంట్రల్ బ్యాంకు ఏటీఎం సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సెంట్రల్ బ్యాంకు మేనేజర్ మోహన్‌రంగ కోరారు. స్థానిక సినిమా సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీఎంను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మండలంలోని ప్రజలంతా ఏటీఎంను వినియోగించుకోవాలని కోరారు.

30న చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం

అన్నవరం: స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 30న దేవాలయ ఉద్యోగులు, విద్యార్థులకు మార్గదర్శనం అనే అంశంపై ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం ఏర్పాటు చేసినట్లు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్, వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. అన్నవరం దేవస్థానం ఉద్యోగులు, పురోహితులు, దేవస్థానం విద్యార్థులు హాజరు కావాలని కోరారు.